సంప్రదాయాలను గౌరవించాలి

అన్నా చెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచిన రక్షాబంధన్ పండుగను గురువారం జిల్లాలో ఘనంగా జరుపుకొన్నారు. రాఖీకట్టి అక్కా, చెల్లెళ్లు నోరు తీపి చేయగా, సోదరులు తోచిన కానుకలు ఇచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు.



పెద్దశంకరంపేట: శిశుమందిర్‌లో రక్షాబంధన్ వేడుకలు



మెదక్: మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అశోక్ ఇంట్లో రాఖీ సంబరాలు

పెద్దశంకరంపేట(మెదక్): భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతీ ఒక్కరూ గౌరవించాలని ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా సరస్వతి శిశుమందిర్‌లో రక్షాబంధన్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ జిల్లా శారీరక్ ప్రముఖ భోల మనోజ్‌కుమార్ రక్షాబంధన్ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు దాదిగారి గంగాధర్, వేణుగోపాల్‌గౌడ్, సుభాష్ గౌడ్, హెచ్‌ఎం వీరప్ప, జైహింద్‌రెడ్డి, ప్రకాషం, పున్నయ్య, సీతారాం, రవివర్మ, సతీష్‌గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

మెదక్: మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్ ఉమ్మడి కుటుంబంలోని 50 మందితో కలిసి రాఖీ పండుగను నిర్వహించారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. అన్న చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకైన రాఖీలను కట్టి, నోరు తీపి చేసుకుంటూ సంబరంగా గడిపారు.

పాపన్నపేట(మెదక్): మండలంలోని గ్రామాల్లో గురువారం రాఖీపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు తమ పుట్టినింటికి వచ్చి అన్నదమ్ముళ్లకు రాఖీలను కట్టి వేడుకలు నిర్వహించారు.

రేగోడ్(మెదక్): మండలంలో రాఖీ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు సోదరులకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

నర్సాపూర్: రక్షాబంధన్ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అన్నదమ్ములకు రాఖీ కట్టేందుకు అక్కాచెల్లెళ్లు పుట్టింటికి వచ్చారు. సోదరులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కాగా రక్షాబంధన్ పండగను పురస్కరించుకుని రాఖీ, మిఠాయి దుకాణాలు కొనుగోలుదారులతో సందడి నెలకొంది.

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా రాఖీ పౌర్ణమి వేడుకలను గురువారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. సోదరులకు అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టి వారి శుభాకాంక్షలు తెలిపారు. రంగంపేట శివాలయంలో పద్మశాలీల ఆధ్వర్యంలో సామూహిక జంధ్యధారణ కార్యక్రమం నిర్వహించారు.

బగళాముఖి శక్తిపీఠంలో పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన బగళాముఖి శక్తిపీఠంలో గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపుతో అభి షేకం, ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. మల్కాజిగిరికి చెందిన వ్యాపారవేత్త శ్రీకాంత్ అమ్మవారికి రూ.5 లక్షల విలువగల బంగారు, వెండి, స్టోన్స్‌తో చేయించిన కిరీటం బహూకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకురావడంపై ట్రస్టు సభ్యులు శివకుమార్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో సందడి..

మండలంలో రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఆడపడుచులు తమ సోదరులకు రాఖీ కట్టి స్వీట్లు తినిపించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. రాఖీ పండగకు ఆడపడుచుతు గ్రామాలకు రావడంతో సందడి నెలకొంది.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలో రాఖీ పండగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. గురువారం వివిధ గ్రామాలలో అన్నదమ్ములకు అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టి వారి ఆశీస్సులు పొందారు.

సామూహిక రక్షాబంధన్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని బండ పోతుగల్, ఫైజాబాద్ గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ధర్మజాగరణ్ ఖండప్రముఖ్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం సామూహిక రక్షాబంధన్ వేడుకలు జరిపారు. చిన్నారులు, యువకులు, గ్రామస్తులు రాఖీలకు పూజలు నిర్వహించి, రక్షాబంధన్ మంత్రాన్ని ఉచ్చరించి నేను నీకు రక్ష, నీవు నాకు రక్ష, మనం దేశానికి రక్ష అంటూ ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు.



చిలప్‌చెడ్: ఫైజాబాద్ హనుమాన్ ఆలయంలో యువకులకు రాఖీలు కడుతున్న బాలికలు



నర్సాపూర్‌లో బీజేపీ నాయకుడు సింగాయిపల్లి గోపికి రాఖీ కడుతున్న అక్కా, చెల్లెళ్లు



శివ్వంపేట: అమ్మవారికి సమర్పించిన కిరీటం



కౌడిపల్లిలో..

సెకండ్ ఏఎన్‌ఎంల వినూత్న నిరసన



నిరసన తెలుపుతున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

మెదక్ కలెక్టరేట్: తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న సెకండ్ ఏఏన్‌ఎంలు గురువారం వినూత్నంగా నిరసన తెలిపారు. రక్షాబంధన్ పండుగ సందర్భంగా తెలంగాణ ఆడపడుచులమైన మా గోస అర్థం చేసుకొని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సీఎం కేసీఆర్ చిత్రపటానికి రాఖీ కట్టారు. ఈ క్రమంలో సమ్మెలో సెకండ్ ఏఎన్‌ఎం సోని సొమ్మసిల్లి పడిపోవడంతో మిగతా వారు ఆందోళనకు గురయ్యారు. తస్నీమ్, తులసి, రమ్య, యాదమ్మ, సంగీత పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్

మెదక్ మున్సిపాలిటీ: వాహనదారులు రోడ్డునిబంధనలు పాటించాలని సీఐ వెంకటేశ్ సూచించారు. గురువారం పట్టణంలోని సుభాష్ కాలనీలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడిపేటప్పుడు వాహన పత్రాలతో పాటు హెల్మెట్ ధరించి ఉండాలన్నారు. సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



సుచిత్‌గౌడ్‌ను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: మహిళలు అన్ని రంగాల్లో ముందున్నప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పురుషులకు ధీటుగా మహిళలు ఉద్యోగాలు, క్రీడల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో పేద కుటుంబాల్లోని మహిళలు బయటకు రాలేకపోతున్నారని.. వారికి అండగా నిలిచేందుకు తాను శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గంలోని మహిళలకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దుబ్బాకలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఇందుకోసం ఈనెల 1వ తేదీ నుంచి 10 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో ఉద్యమకారులకు స్థానం లేదు

దౌల్తాబాద్(దుబ్బాక): బీఆర్‌ఎస్‌లో ఉద్యమకారులకు స్థానం లేదని, దుబ్బాక టికెట్ విషయంలో సోలిపేట కుటుంబానికి అన్యాయం జరిగిందని మండల కేంద్రానికి చెందిన సుచిత్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేసి ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందిస్తున్న దేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: అనారోగ్యంతో హైదరాబాదులోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని రాజ్‌పల్లి గ్రామానికి చెందిన దుర్గేష్‌కు ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఎల్ఓసీ అందించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.5లక్షల ఎల్ఓసీని మంజూరు చేయగా, గురువారం క్యాంపు కార్యాలయంలో ఇప్కా డైరెక్టర్ దేవేందర్ రెడ్డి బాధిత కుటుంబసభ్యులకు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, మెదక్ వైస్ ఎంపీపీ మార్గం ఆంజనేయులు, రైతుబంధు మండల అధ్యక్షుడు కిష్టయ్య, నాయకులు ఎలక్షన్ రెడ్డి, దొంతి నారాయణ తదితరులు ఉన్నారు.

సోమక్కపేట్‌లో కార్డన్‌సెర్చ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): అక్రమ రవాణా, నేరస్తుల ఉనికి కనిపెట్టడానికి కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తామని నర్సాపూర్ సీఐ షేక్‌లాల్ మదార్ తెలిపారు. బుధవారం రాత్రి చిలప్‌చెడ్, కౌడిపల్లి, నర్సాపూర్ ఎస్‌ఐలతో కలసి సోమక్కపేట్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 68 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు చూపించి వాహనాన్ని తీసుకెళ్లొచ్చన్నారు. అనంతరం హెల్మెట్ వినియోగం, సీసీ కెమెరాల ప్రాధాన్యత, మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహ్మద్‌గౌస్, నర్సాపూర్ ఎస్‌ఐ శివకుమార్, కౌడిపల్లి ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సోమక్కపేట్‌లో మాట్లాడుతున్న సీఐ షేక్‌లాల్ మదార్

ఘనంగా సామూహిక జంధ్యధారణ



జంధ్యధారణ చేస్తున్న పద్మశాలీలు

కౌడిపల్లి(నర్సాపూర్): జంజిరాల పౌర్ణమి సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సామూహిక జంధ్యధారణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం మండల కేంద్రమైన కౌడిపల్లిలోని శ్రీఅభయ సీతారామాలయం వద్ద మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు పిశ్కె నర్సింహులు ఆధ్వర్యంలో ఆలయ పురోహితుడు ఫణీంద్రశర్మ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పద్మశాలి సంఘ సభ్యులకు జంధ్యం ధరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా యువత ఉపాధ్యక్షుడు సంబారపు తిరుమలేష్, డాక్టర్ పురుషోత్తం, మంత్రి క్రిష్ణ, పద్మ దుర్గయ్య, పోల జనార్ధన్, పోల ప్రభాకర్, పోల పురుషోత్తం, మంత్రి అంజనేయులు, డాక్టర్ శ్రీనివాస్, పి.శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్, నవీన్, లక్ష్మణ్, భీమేష్, రంగేశ్, శ్యాంకుమార్, వీరేష్, నరేందర్, నర్సింహులు శంకరయ్య, కిష్టయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గురుపీఠం బాలాలయం ప్రారంభం



శ్రీ గురుపీఠం నిర్మాణ పూజలో పాల్గొన్న జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా తదితరులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి గూడుర్‌లో హైకోర్ట్ న్యాయవాది శివకుమార్‌గౌడ్ నిర్మించతలపెట్టిన శ్రీ గురుపీఠం నిర్మాణంలో భాగంగా గురువారం బాలాలయం ప్రారంభించారు. వేద పండితుడు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. గురుపాదుకా రుద్రాభిషేకం, యజుర్వేద పారాయణం ప్రత్యేక పూజ మహోత్సవం నిర్వహించారు. త్వరలో శ్రీ గురుపీఠం నిర్మాణ పనులు పూర్తి చేస్తామని శ్రీ గురుపీఠం ఫౌండర్, చైర్మన్ శివకుమార్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా, దేవదత్త శర్మ, సూర్యకుమార్‌గౌడ్, లిఖిత, రాజేందర్‌రెడ్డి, కృష్ణాగౌడ్, భిక్షపతి యాదవ్, కొండల్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

వైద్య శిబిరానికి స్పందన

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలో విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్, కేంద్ర ఎఫ్‌సీఐ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. హైదరాబాద్ కుషాయిగూడకు చెందిన సన్‌సీడ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ప్రజలు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం వైద్యులు ఉచితంగా మందులను అందించి, అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సన్‌సీడ్ ఆస్పత్రి సిబ్బంది మహేష్, శ్రీచందన, గాయత్రి, సంధ్య, ట్రస్టుసభ్యులు రాజన్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, భూమేశ్వర్‌గౌడ్, క్రిష్ణ మూర్తి, సిద్ధు, అనిల్, నాగరాజు తదితరులున్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): టీటీడీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని రాందాస్‌గూడ గ్రామంలోగల రామాలయంలో గురువారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి, టీటీడీ సభ్యులు లక్ష్మీనారాయణ, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పరామర్శ**



తిమ్మాపూర్‌లో సర్పంచ్ పద్మ కిష్టయ్యను పరామర్శిస్తున్న మురళీధర్‌యాదవ్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తిమ్మాపూర్ సర్పంచ్ పద్మ కిష్టయ్య కాలికి శస్త్రచికిత్స జరిగింది. గురువారం నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్, బీజేపీ నాయకుడు మురళీధర్‌యాదవ్ తిమ్మాపూర్ వెళ్లి పరామర్శించారు.

◆ **నేడు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పర్యటన**

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలో శుక్రవారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పర్యటించనున్నట్టు ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ శివారులోని కుడి చెరువులో ప్రభుత్వం మత్స్యకారులకు పంపిణీ చేసిన చేప పిల్లలు వదులుతారని చెప్పారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

◆ **భూమి పూజ**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని పోలీస్‌స్టేషన్ వీధిలో రోడ్డు నిర్మాణాలకు సర్పంచ్ శ్రీనివాస్ భూమిపూజ చేశారు.

◆ **నిధులు విడుదల చేయాలి**

రామాయంపేట (మెదక్): దళిత బంధు, మైనార్టీ పథకాల కింద మండలానికి నిధులు మంజూరు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి భూపతి రాజు డిమాండ్ చేశారు. మైనార్టీ నిధుల కోసం చాలామంది ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. దళిత బంధు పథకం కింద మండలంలో సంకాపూర్‌కు మాత్రమే నిధులు విడుదలయ్యాయని, మండల పరిధిలోని మిగతా గ్రామాలకు కూడా ఈ పథకం కింద నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

◆ **నేడు పెన్షన్ విద్రోహ దినం**

చిన్నశంకరంపేట (మెదక్): సెప్టెంబర్ ఒకటిన పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని, ఉద్యోగ ఉపాధ్యాయలు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి కర్రె పోచయ్య కోరారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేసే వరకు తమ పోరాటం ఆగదన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను చేపట్టాలని కోరారు. పీఆర్సీ కమిటీని వెంటనే వేసి ఉద్యోగులకు మేలు చేయాలని కోరారు. మోడల్‌స్కూల్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే రఘునందర్‌రావుకు ఆహ్వానపత్రిక అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

చేగుంట(తూప్రాన్): మహంకాళీ ఉత్సవాలకు రావాలని కోరుతూ చేగుంట మహంకాళీ ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు ఆహ్వానపత్రికను అందించారు. చేగుంటలో ఈనెల 9వ తేదీ నుంచి 13 వరకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గొల్ల సత్యం, పవన్, నర్సింలు, చింతాల సిద్ధిరాములు బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో పూజలు



సంతోషిమాతకు ఒడిబియ్యం సమర్పిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన సంతోషి మాత ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం సంతోషి మాత జన్మదినం సందర్భంగా అమ్మవారికి ఆలయ పూజారులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యుదాఘాతంతో దూడ మృతి



దూడ కళేబరం వద్ద రైతు

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యుదాఘాతంతో దూడ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని గన్యాతండాలో చోటు చేసుకుంది. గురువారం స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గన్యాతండాకు చెందిన రూప్‌సింగ్ దూడ ఇంటి నుంచి మేత మేసుకుంటూ వెళ్లి పక్కనే ఉన్న విద్యుత్ తీగలను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దూడ విలువ సుమారు రూ. 30 వేల వరకు ఉంటుందని రూప్‌సింగ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

నిరసన తెలపండి



మాట్లాడుతున్న అధ్యక్ష, కార్యదర్శులు

మెదక్: సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహదినంగా పాటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రణీద్ కుమార్, రాజగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం మెదక్‌లోని ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. నూతన పెన్షన్ విధానాన్ని అమలులోనికి తీసుకొచ్చిన సెప్టెంబర్ 1న ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన తెలపాలని, కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పోచయ్య, శివప్రసాద్, సిద్దిరాములు, రాజు, నరేష్, దుర్గరాములు, వేణుగోపాల్, దిలీప్ కుమార్, మల్లేశం, గోపాల్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

'క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దు'

వర్గల్(గజ్వేల్): క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు విపరిణామాలకు దారితీస్తాయని గౌరారం ఎస్సై విజయభాస్కర్ అన్నారు. బుధవారం రాత్రి అనంతగిరిపల్లిలో 'కనువిప్పు' కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, మూఢనమ్మకాలు, సామాజిక రుగ్మతలు, సోషల్ మీడియా ప్రభావం, మహిళల చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. గంజాయి కలిగి ఉన్నా, క్రయ విక్రయాల సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100, లేదా సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూం 8712667100 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీత వెంకటరమణారెడ్డి, ఉప సర్పంచ్ కనకరాజు, ఎంపీటీసీ వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.